
# మనసు పాడింది సన్నాయిపాట

కె.అలివేలు మంగ



ఇంగ్లీషు వార్తలు వింటూ పక్కమీద వాలిపోయాడు మాధవ్- నిద్రముంచుకొస్తోంది. అయినా ఏదో జ్ఞాపకం వచ్చినవాడికి మల్లే-

వేణీ- వేణీ- ఇలా రా! అంటూ భార్యను కర్కశంగా బిగ్గరగా పిలిచాడు.

వంట ఇంట్లో ఉన్న వేణి భర్తగావుకేక వినబడగానే గజగజ వణికిపోయింది.

అమ్మో- ఆయన ఇంకా నిద్రపోలేదా! అనుకుంటూ మూడునెలల చిన్నారి చిట్టితల్లి నీరజను నిద్రపుచ్చి పడకగదిలోకి ప్రవేశించింది.

అప్పటికే గాఢనిద్రలోకి జారిపోయాడు మాధవ్.

భర్తతో తనకు రోజూ జరిగే సంఘర్షణలు తలుచుకుంటూ వణికిపోతున్న కృష్ణవేణి భర్త నిద్రపోవటం చూసి "అమ్మయ్య" ఈ రోజుక్కి బతికిపోయానను కుంది.

కలత చెందిన హృదయంతో కనులు మూసుకుపడుకుంది వేణి.

అయినా నిద్రపట్టడంలేదు. వేణి మనసు ఆలోచనలతో అల్లాడిపోతోంది. మస్తిష్కంలో చెలరేగే బాధలు వేదనలు- అలలు అలలుగా సాగిపోతున్నాయి. నిర్లిప్తంగా నీలాల నింగిని కిటికీలోంచి చూస్తూ పడుకుంది కృష్ణవేణి.

వినీలాకాశం- నిర్మలంగా, నిశ్చలంగా నిగనిగలాడుతోంది. నీలిరంగు బనారస్ పట్టుచీరపై అందంగా అద్దిన జరీపూలవలే తళుకుతళుకు తారలు జిగేల్ జిగేల్‌మంటున్నాయి.

ఇన్ని తారకలలో ఏ తారక అందగత్తె అనేది తేల్చుకోలేక సతమతమయి కాబోలు మబ్బుల చాటున దోబూచులాడుతున్నాడు అందాల ఛందమామ-

తమ చాటున దాక్కోటానికి వచ్చిన జిలిబిలి జిలిబిలి జాబిల్లిని ఆటపట్టించాలన్నట్లు మబ్బులన్నీ మెలమెల్లగా దూదిపింజలవలె విడివడిపోతున్నాయి. గాలిలో తేలిపోతున్నాయి- గాలిలో తేలిపోతున్న మబ్బుల చాటునుండి బయటపడ్డ రేరాజు మబ్బుల ఊయలలో సయ్యాటలాడుతున్నాడు- పెరటిగోడపై విరబూసిన రాధామాధవ పూలు సుగంధ పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఇంతటి సుమనోహరమైన వాతావరణం కూడా వేణి మనసుకి ఊరట కలిగించలేకపోయింది. కారణం ఆమె హృదయంలో ఆవేదనా సెగలు పొగలు కక్కుతున్నాయి.

ప్రతిరోజూ మాధవ్ తనని వేధించటంతనకి భయాందోళనలు కలిగిస్తోంది.

ఉదయం ఆఫీసుకి వెళ్తూ- "మీ వాళ్లిచ్చిన కట్నం చాలదు మిగతాది తెమ్మని- స్కూటర్ కావాలని- పోనీ పోనీ అని ఊరుకుంటున్నాను- ఇక ఊరుకొనేది లేదనీ- తక్షణం తేవాలనీ- తేకపోతే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించిన మాటలు ఆమె మనసులో కలవరం రేపుతున్నాయి.

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన తర్వాత గూడా ఇదే విషయం మళ్లీమళ్లీ చెప్పి వ్యధకి గురిచేశాడు.

తను మాత్రం ఏంచేయగలదు. తను అసహాయురాలు. తన పెళ్లికి కట్నం ఇచ్చారు. ఆడపడుచుల లాంఛనాలు ఇచ్చారు. పట్టుచీరెలు- పట్టుబట్టలు- వెండి సామాన్లు- ఆభరణాలు- అన్నీ ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించారు.

ఇంకా కట్నం కావాలనీ- స్కూటర్ ఇవ్వాలనీ పట్టుబట్టి తనని వేధిస్తే ఏంలాభం- తన తల్లిదండ్రులు ఉన్నదాంట్లో మిగతా పిల్లల్ని పెంచి పోషించి పెద్దవాళ్లను చేయాలి. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం- మధ్య తరగతి బడుగు జీవితం సాగిస్తున్నారు తన తల్లిదండ్రులు.

ఇటు అలాంటి వారిని పీడించమని తనని వేధించే భర్త- మరొకపక్క అసహాయస్థితిలో ఉన్న తన తల్లిదండ్రులు. ఇద్దరి మధ్య అడకత్తెరలో పోకచెక్కలా. అసహాయురాలై నలిగిపోతోంది కృష్ణవేణి.

పెళ్లయి రెండు సంవత్సరాలయింది. తను ఓచిన్నారి పాపకి తల్లి అయింది. తనకంటే తక్కువ ఆర్థికస్థితిలో కొట్టుమిట్టాడుతున్న అత్తమామల్ని అదికావాలి ఇది కావాలి అంటూ ఇంకా వేధిస్తున్న తన భర్త మాధవ్ అమానుష ప్రవర్తనకు బాధపడుతూ కలతచెందిన మనస్సుతో కన్నీళ్లు కారుస్తూ ఒరిగింది కృష్ణవేణి తన పక్కపై-

పక్కనే మాధవ్ గాఢ సుషుప్తిలో ఉన్నాడు. కలలు కంటున్నాడు. కలత మనసుతో నిద్రలోకి జారిన మాధవ్ తన ముద్దుల తనయ- చిన్నారి నీరజ పెరిగి పెద్దదయింది. పెళ్లికూతురయింది. పెళ్ళి జరిగింది- అత్తవారింటికి వెళ్లింది-

అంతలోనే తిరిగి వచ్చింది బావురుమంటూ-

ఏమయిందే అని అడిగాడు తను-

'నాకు కారు కావాలి. మీ నాన్నని అడిగి కారు కొని తీసుకురా- కారుతో వస్తే రా- లేకపోతే అక్కడే ఉండు" అని నన్ను వెళ్లగొట్టారు అంది తండ్రితో నీరజ-

ఏమిటీ- కారు కొనివ్వాలా? పెళ్లిలోనే అన్ని గొంతెమ్మకోర్కెలు తీర్చానుగదా! తనది పెద్ద ఉద్యోగం- ఆస్తిపాస్తులున్నాయి. తనకేం తక్కువ- తను కొనుక్కోవచ్చుగా- ఏమిటీ రాద్ధాంతం. నేనిప్పుడేం చేయాలి- నేనేమన్నా జమిందారునా అంటూ వాపోయాడు మాధవ్.

అయినా నాన్నా వేలూ, లక్షలూ, వెండి, బంగారం పెట్టి మెప్పించి గొప్ప చూపించుకోవాలని ఆశించావు- నా మనసు తెలుసుకొని నన్ను గౌరవించి, ప్రేమించి, జీవితాంతం మనసున్న మనిషిగా ఒక పేదవాడైనా సరే నాన్నా అంటే విన్నావా- ఘరానా అల్లుడు కావాలనుకున్నావు- కోరికలు ఘరానాగానే ఉన్నాయి. అసలు మనుషుల్ని డబ్బుతో కొనడం- ధనం ఇవ్వడం- పుచ్చుకోవడం నేర్పితే- ఇంకా, ఇంకా కావాలంటారు- ఇచ్చే వాళ్లకీ బుద్ధిలేదు. పుచ్చుకునేవాళ్లకి అంతకంటే లేదు.

పెద్ద ఆస్తిపరులూ, ధనవంతులూ అని, ఘనంగా కట్నకానుకలు ఇచ్చి ఆడంబరంగా నన్ను పంపించావు. ఇప్పుడేమయిందో చూడు నాన్నా! వాళ్ల కోరికలు ఎలా ఉన్నాయో- నేనేం కావాలి- నా జీవితం ఏంకావాలి- నేనేకాదు- నా లాంటి అభాగ్యులు ఎంతమందో- ఆడపిల్లగా పుట్టటమే నేను చేసిన పాపమా! ఎంత ఇస్తే తీరుతుంది ఈ ధనదాహం- నాన్నా అయినా ఎందుకు ఇవ్వాలి- ఇవ్వనంటే నన్ను రానివ్వనంటున్నారు. మనం రోజూ పేపర్లలో చదువుతున్నట్లు గానే నేను కూడా హత్యలు- ఆత్మహత్యలు జాబితాలో చేరాల్సిందేనా? ఏమిటి ఈ అన్యాయం? నాకేటి దిక్కు అంటూ ఏడుస్తోంది నీరజ. తన ముద్దుల కూతురు వేదన రోదన చూసి భరించలేక "వద్దమ్మా- వద్దు- నువ్వు ఆత్మహత్య చేసుకోవద్దు- నువ్వు హత్య చేయబడవద్దు- "నా చిట్టి తల్లీ, నీకు పెళ్లి చేసి వంపింది నిండు నూరేళ్ల సుఖంగా ఉండాలని- అంటూ కలవరిస్తూ లేచి కూర్చున్నాడు మాధవ్.

పక్కనే ఉన్న కృష్ణవేణి భర్త కలవరింతలు, నిద్రలో కేకలు విని లేచి కూర్చుని ఏమయిందండీ- మన చిట్టి తల్లి హాయిగా ఉయ్యాల్లో నిద్రపోతోంది చూడండి. దానికేమీ కాలేదు- ఏమిటా పలవరింతలు- ఏమైనా కల వచ్చిందా? అని అడిగింది. కలకని ట్రాన్స్‌లో ఉన్న మాధవ్ భార్య పలవరింపుతో మనలోకంలోకి వచ్చి కలయచూసి తన బిడ్డ ఉయ్యాల్లో హాయిగా నిద్రపోవటం చూసి నిబ్బరించుకున్నాడు.

వేణీ నన్ను క్షమించు- నాకు బుద్ధి వచ్చింది. మన బిడ్డ నీరజ నా కళ్లు తెరిపించింది అంటూ తన కలలో తాను చూసినవన్నీ పూసగుచ్చినట్లు చెప్పి, నాకిప్పుడు అర్థమయింది. రోజూ నువ్వెంత బాధపడుతున్నావో- నీలో నువ్వు ఎంత కుమిలిపోతున్నావో- నేను నిన్ను రోజూ హింసిస్తున్నాను. నాకేం ఖర్మ- నాకు ఏంకావాలో నేనే కొనుక్కుంటా. లేకపోతే ఉన్న దాంతో సరిపెట్టుకుంటా. ఇంకా అత్తమామల్ని, నన్ను నమ్మి నా జీవిత భాగస్వామిగా వచ్చిన నిన్ను వేధించను అంటూ పెద్ద సంస్కర్తలా మాట్లాడటం మొదలుపెట్టాడు.

ఇకనుంచీ నీ మాధవ్ నిన్నెప్పుడూ బాధపెట్టడు నమ్ము అంటున్న మాధవ్ కళ్లలోకి చూసింది వేణి- మాధవ్ కనులలో గోచరించిన బాధనీ- భయాన్నీ స్పష్టంగా చూసింది కృష్ణవేణి. దాంతోపాటు తనపై కలిగిన ప్రేమానురాగాలను, తనపై కలిగిన ప్రేమనీ తన్మయత్వంతో చూస్తూ భర్త కౌగిలిలో ఇమిడిపోతూ- మన జీవితాలలో నవోదయమైనదండీ అన్నది వేణి-

సమీపంలోగల దేవాలయంలో గణగణమని గంటలు మోగించి మంత్రపఠనంతో స్వామివారి సుప్రభాతసేవకు ఉపక్రమించాడు పూజారి.

దేవాలయంలో నాదస్వరం శ్రావ్యంగా వినబడ సాగింది. మదిలో మధురమైన ఊహలతో కృష్ణవేణి మనసు పాడింది సన్నాయిపాట. ■